ములుగు జిల్లా వాజేడు-గుమ్మడిదొడ్డి ప్రధాన రహదారిపైకి చేరిన గోదావరి వరద

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల-రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య తెగిన చలివాగు తాత్కాలిక రోడ్డు

విడువని వాన

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు

పొంగుతున్న వాగులు, చెరువులు, చెక్‌డ్యాంలు ● లోతట్టు ప్రాంతాలు జలమయం, తెగిన రోడ్లు
గ్రామాల్లో నిలిచిపోయిన ప్రజల రాకపోకలు ● సింగరేణి కారిడార్‌లో ఆగిపోయిన బొగ్గు ఉత్పత్తి

న్యూస్‌నెట్‌వర్క్, జూలై 21 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా మూడు రోజుల నుంచి వర్షాలు విడువకుండా కురుస్తున్నాయి. ఆదివారం కూడా పలు జిల్లాల్లో ఎడతెరిపిలేని కుండపోత వర్షం కురిసింది. ఆయా జిల్లాల్లోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలకు భారీగా వరద నీరు చేరడంతో మత్తళ్లు పోస్తున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో వరద ధాటికి అంతర్గత రోడ్లు తెగిపోయి ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి స్థానికులు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో వర్షాలకు ఇండ్లు తడిసి కూలిపోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వర్షం దంచికొడుతున్నది. మూడు రోజుల క్రితం మొదలై వదలకుండా కుండపోత పోస్తున్నది. కోనరావుపేట మండలం మామిడిపల్లిలో పాముగారి రమేశ్ పెంకుటిల్లు కూలిపోయింది. మల్లాపూర్ మండల కేంద్రంలో దామెర నరేశ్ ఇల్లు కూలిపోగా తహసీల్దార్ వీర్‌సింగ్ పరిశీలించారు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని బోయినిపేట(తెనుగుగూడెం)లో కుంట సమ్మక్క, సందీప ఇల్లు కూలిపోయింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను ముసురు వాన వీడటం లేదు. కుండపోత వానలతో ప్రాణహిత, గోదావరి నదులకు వరద పోటెత్తుతున్నది. ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలోని బారెగూడలో రోడ్డు బురదమయం కాగా.. గ్రామస్థులు వరి నాటు వేసి నిరసన తెలిపారు. చింతలమానేపల్లి మండలంలోని దిందా-కేతిని వాగు ఉప్పొంగడంతో దిందా ప్రజలు మూడు రోజులుగా జలదిగ్బంధంలోనే ఉన్నారు. కొండపల్లి గ్రామంలో గొల్లవాగుపై శిథిలావస్థలో ఉన్న లో లేవల్ వంతెనలో కోడె పడి మృతి చెందింది. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో ఎడతెరపిలేకుండా వర్షాలు పడుతుండటంతో సింగరేణిలోని 20 ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి, ప్రైవేట్ కాంట్రాక్టు సంస్థలకు అప్పగించిన మట్టి తవ్వకాలు, రవాణా పూర్తిగా నిలిచిపోయాయి. శ్రీరాంపూర్ ఏరియాలో 5 రోజుల్లో రూ.4.5 కోట్ల నష్టం వాటిల్లినట్టు అధికారులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. లో లెవల్ కల్వర్టులపై నుంచి వరదనీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గర్మిళ్లపల్లి, ఓడేడుతోపాటు బూర్నపల్లి, కిష్టంపేట మధ్య మానేరు వరద ఉధృతికి తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. భూపాలపల్లి మండలం మోరంచపల్లి సమీపంలో మోరంచ వాగు ఉధృతి రోజు రోజుకూ పెరుగుతున్నది. మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తున్నదని, వరద ప్రవాహం ఇలాగే కొనసాగితే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి ఓసీ-2, 3 గనుల్లోకి భారీగా వరద నీరు, మట్టి చేరడంతో ఉపరితల గనులు బురదయమై బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. తాడిచర్ల జెన్కో ఆధ్వర్యంలో చేపడుతున్న ఏ ఎమ్మార్ కంపెనీలో బొగ్గు ఉత్పత్తికి ఆంతరాయం ఏర్పడింది. వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. రెస్క్యూ బృందాలను సిద్ధం చేశారు. డీఆర్ఎఫ్ బృందాలను అప్రమత్తం చేశారు. వరంగల్ దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువు నిండటంతో లోతట్టు ప్రాంతాల్లో కలెక్టర్ సత్యశారద, అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. పశువులను మేపడానికి పొలాల్లోకి వెళ్లి వర్షానికి తడిసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం లెంకలగడ్డ గ్రామానికి చెందిన పంతంగి లస్మయ్య(55) మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జనగామ జిల్లా వడ్లకొండలో పాత గోడ కూలి గుండె రమ (38) మృతి చెందింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో చెరువులు, వాగులు అలుగులు పోస్తున్నాయి. నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్, ధర్మోరా మొండివాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గాండ్లపేట్ శివారులో వరదకాలువ పక్కన పంటలు నీటమునిగాయి. నవీపేట మండలంలోని ఫత్తేనగర్, కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం బోనాల్ తండా, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 47వ వార్డులో ఇండ్లు కూలిపోయాయి. ఉమ్మడి మెదక్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల వ్యాప్తంగా ముసురు కురుస్తున్నది. పినపాక మండలంలో చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షానికి ప్రజలు బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు.

మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓసీపీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

అత్యధిక వర్షపాతం నమోదైన మండలాలు

జిల్లా పేరు	మండలం	సెం.మీ.
నిర్మల్	సారంగపూర్	12.45
భద్రాద్రి	అశ్వాపురం	8.3
కరీంనగర్	గంగాధర, హుజూరాబాద్	7.86
పెద్దపల్లి	ధర్మారంలో	6.77
సంగారెడ్డి	కంగ్టిలో	4.8
సిద్దిపేట	మద్దూరు	4.4
నాగర్‌కర్నూల్	తిమ్మాజిపేట	2.70
నారాయణపేట	మాగనూర్	2.56
మహబూబ్‌నగర్	మహ్మదాబాద్	2.24
వనపర్తి	మదనాపురం	2.15
రాజన్న సిరిసిల్ల	చందుర్తి	1.46
సూర్యాపేట	మద్దిరాల	1.36
యాదాద్రి భువనగిరి	రామన్నపేట	1.20
జోగుళాంబ గద్వాల	గద్వాల	0.96
మెదక్	నిజాంపేట	0.92

మంచిర్యాల జిల్లా భీమారంలో 15 కిలోల చేపలు పట్టిన యువకులు

కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం బోనాల్ తండాలో కూలిపోయిన ఇల్లు

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	31.9°c	23.5°c
హైదరాబాద్	30.8°c	23.6°c
ఖమ్మం	29.0°c	25.0°c
కరీంనగర్	29.0°c	25.0°c
వరంగల్	27.0°c	23.0°c
నల్లగొండ	27.0°c	21.4°c
మహబూబ్‌నగర్	26.1°c	22.3°c
రంగారెడ్డి	25.7°c	21.5°c
నిజామాబాద్	25.4°c	22.9°c
మెదక్	25.3°c	21.8°c

తెరిపివ్వని వాన

- మరో 3 రోజులు వర్షాలు
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): మూడు, నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జనజీవనం స్తంభించింది. రాగల మూడురోజులు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. ఒడిశా పరిసరాల్లో కొనసాగుతున్న అల్పపీడనం వాయవ్య దిశగా కదులుతూ ఛత్తీస్‌గఢ్ మీదుగా కొనసాగుతుందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం అత్యధికంగా నిజామాబాద్ జిల్లా వేంపల్లెలో 18.5 సెం.మీ., నిర్మల్ జిల్లా మామడలో 13.8, ఖానాపూర్‌లో 11.9, ములుగు జిల్లా మల్లంపల్లిలో 12.7 సెం.మీ. వర్షపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్ , మేడ్చల్ -మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ , కామారెడ్డి జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లోఅలెర్ట్‌ను జారీ చేసింది.

సిరిసిల్ల జిల్లా వేములవాడ అయ్యప్ప దేవాలయం వద్ద నిలిచిన వరద

భద్రాద్రి జిల్లా చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న వరద

జూరాల ప్రాజెక్ట్ గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

కృష్ణమ్మ పరుగులు..

- జూరాలకు 1.11 లక్షల క్యూసెక్కులు
- శ్రీశైలానికి 96,141..

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ)/నెట్‌వర్క్: ఎగువన విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ పరుగులు తీస్తున్నది. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చి చేరుతుండగా దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి జూరాల ప్రాజెక్టుకు 1.11 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, శ్రీశైలం ప్రాజెక్టుకు 96 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. తుంగభద్ర నుంచి స్వల్పంగా వరద శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్నది. విద్యుత్తు ఉత్పత్తి ద్వారా జలాలను దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని స్వర్ణ, గడ్డెన్న వాగుల్లోకి వరద కొనసాగుతున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసానిలో ఆరు, తాలిపేరులో 25 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీకి వరద ప్రవాహం పెరిగింది. పైనుంచి వస్తున్న వరదతో జూలూరు -రుద్రవెల్లి లోలెవెల్ బ్రిడ్జి వద్ద మూసీ పరవళ్లు తొక్కుతున్నది.

వివిధ ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఆదివారం నాటి నీటిమట్టం వివరాలు

	రిజర్వాయర్	ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో	ప్రస్తుతమట్టం అడుగుల్లో	పూర్తిస్థాయినిల్వ టీఎంసీల్లో	ప్రస్తుతనిల్వ టీఎంసీల్లో	ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో	అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో
కృష్ణానదిపై	ఆల్మట్టి	1705.00	1699.15	129.72	99.68	1,24,000	1,50,000
	నారాయణపూర్	1615.00	1613.75	37.64	32.78	1,25,000	1,45,750
	ఉజ్జయిని	1630.00	1604.54	117.24	51.01	7,954	176
	జూరాల	1045.00	1040.58	9.66	6.81	1,11,000	1,19,253
	తుంగభద్ర	1633.00	1624.41	105.79	78.67	1,17,647	4,754
	శ్రీశైలం	885.00	817.70	215.81	41.70	96,141	0
	నాగార్జునసాగర్	590.00	504.50	312.05	122.97	0	9,646
	పులిచింతల	175.00	100.72	45.77	0.83	640	50
గోదావరిపై	సింగూరు	1717.93	1704.63	29.91	13.63	391	391
	నిజాంసాగర్	1405.00	1387.52	17.80	03.14	0	0
	శ్రీరాంసాగర్	1091.00	1067.10	90.31	16.96	18,518	503
	కడెం	700.00	690.65	7.60	5.42	8,785	14,229
	ఎల్లంపల్లి	485.56	463.32	20.18	07.88	42,314	331
	మిడ్‌మానేరు	1043.31	1001.56	27.50	05.30	178	35
	లోయర్‌మానేరు	920.00	887.30	24.07	05.03	771	204
కాళేశ్వరం ప్రాజెక్టు	లక్ష్మీ (మేడిగడ్డ)	100	92.81	16.17	2.8	5,52,600	5,52,600
	సమ్మక్కబరాజ్	83	78.5	6.94	3.2	8,23,450	8,23,450
	సీతమ్మసాగర్	63	51.7	36.57	0.2	9,01,989	9,01,989

భద్రాచలంలో ఉధృతంగా గోదావరి

- ఆదివారం రాత్రి 8 గంటలకు నీటిమట్టం 43.6 అడుగులకు
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 21: భద్రాద్రి జిల్లా భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. భద్రాచలం వద్ద దాదాపు 9 లక్షల క్యూసెక్కుల వరద కొనసాగుతున్నది. ఆదివారం రాత్రి 8 గంటలకు నీటిమట్టం 43.6 అడుగులకు చేరింది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఎగువన ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల వల్ల గోదావరికి వరద పెరుగుతున్నది. ఆదివారం సాయంత్రానికి 41.9 అడుగులుగా ఉన్న వరద రాత్రి 8 గంటలకు 43.6 అడుగులకు పెరిగింది. స్నానఘట్టాలు మునిగిపోయి కల్యాణకట్ట వద్దకు వరద చేరుకున్నది. రామయ్య దర్శనానికి వచ్చిన భక్తులు మెట్ల వద్దకు వచ్చి శిరస్సున గోదావరి నీళ్లు చల్లుకొని వెళ్తున్నారు. 43 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయింది. విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న పంప్‌హౌస్ నుంచి పట్టణంలోని వర్షపు నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. భద్రాచలంలో 5 రోజులుగా వర్షం కురుస్తున్నది.

వరద ప్రభావిత గ్రామాల జాబితా..

భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఆదివారం సాయంత్రానికి 43.88 మీటర్ల మేర పారుతున్నది. అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. గోదావరిలో వరద పెరుగుతూనే ఉన్నది. తాజాగా ఇరిగేషన్ అధికారులు భద్రాచలం డివిజన్‌లో గోదావరి వరద ప్రభావిత గ్రామాలకు సంబంధించి ముందస్తుగా జాబితాను విడుదల చేశారు. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాల పరిధిలో మొత్తంగా 110 గ్రామాల పేర్లను ప్రకటించారు. గోదావరి 43-48 మీటర్ల వద్ద ప్రవహిస్తే ఆయా మండలాల్లో ఎలాంటి ముంపు ఉండబోదని తెలిపారు. 48-53 మీటర్ల వద్ద చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో వరద ముంపు ఉండగా, 53-73 మీటర్ల వరకు అన్ని మండలాల్లో ముంపు ఉంటుందని ఇరిగేషన్‌శాఖ వెల్లడించింది.

భద్రాద్రి జిల్లా భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద ఉధృతంగా..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. 9.20 మీటర్ల ఎత్తులో 5.53 లక్షల క్యూసెక్కులుగా లక్ష్మీ బరాజ్ వైపు పారుతున్నది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి ప్రవాహం ఆదివారం సాయంత్రం ఐదు గంటల వరకు 14.400 మీటర్లకు చేరుకున్నది. మొదటి ప్రమాద హెచ్చరికను 14.830 మీటర్లకు జారీ చేస్తారు. ప్రస్తుతం గోదావరి వరద పెరుగుతుండటంతో ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. మంగపేట పుష్కరఘాట్, కమలాపురం బిట్ట్ ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి ప్రవాహం పెరిగింది. వాజేడు మండలంలోని పేరూరు వద్ద ఆదివారం సాయంత్రం ఐదుగంటలకు 15.830 మీటర్లకు (49 అడుగులు) నీటిమట్టం చేరుకున్నది. మహారాష్ట్రతోపాటు ఆదిలాబాద్ జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది ఉప్పొంగుతున్నది. ఇంద్రావతి నుంచి సైతం భారీగా వరద వస్తుండటంతో లోయర్ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. సిర్పూర్(టీ) మండలంలోని సిర్పూర్(టీ)-వెంకట్రావ్‌పేట్ అంతర్రాష్ట్ర వంతెన వద్ద పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది.

- ఉప్పొంగిన బొగత

ఎగువన కురుస్తున్న వర్షాలకు గుట్టలపై నుంచి భారీగా వరద వస్తుండటంతో చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగర బొగత జలపాతంలోకి ఉప్పొంగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో పర్యాటకులు పెద్ద ఎత్తున జలపాతాన్ని వీక్షించేందుకు వచ్చారు. సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ ఎంజాయ్ చేశారు. - వాజేడు

పెదవాగు గేట్లు ఎందుకు తెరవలేదు?

- పరిస్థితిని ఎందుకంచనా వేయలేదు?
- గండిపడే వరకు ఏం చేస్తున్నారు?
- సమీక్షలో అధికారులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫైర్

అశ్వారావుపేట రూరల్, జూలై 21: పెదవాగు వాస్తవ పరిస్థితిని అంచనా వేయకపోవడంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'రైతులు నాకు ఫోన్ చేసే దాకా మీరేం చేశారు? అధికారుల సమన్వయంతో పనిచేసి గేట్లను ముందుగానే తెరిచి ఉంటే ప్రమాదం జరిగేది కాదు కదా? వెలుతురు తగ్గి హెలికాప్టర్లు తిరిగే వాతావరణం లేకుంటే ప్రాణనష్టం జరిగేదే కదా?' అంటూ మండిపడ్డారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం పెదవాగు ప్రాజెక్టుపై స్థానిక గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ అధ్యక్షతన వివిధ శాఖల జిల్లా అధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. అంతకుముందు ఆయన గండి పడిన ప్రదేశాన్ని, గుమ్మడవల్లి నుంచి ప్రాజెక్టుకు వెళ్లే రహదారిని, దానికి పడిన గండ్లను, పొలాల్లో వేసిన ఇసుక మేటలను, వరిపంట కొట్టుకుపోయిన పొలాలను, వరద వల్ల మునిగిన ఇండ్లను పరిశీలించారు. సమీక్షలో భాగంగా అధికారులతో మాట్లాడుతూ.. ఎగువ నుంచి వచ్చే నీటి గురించి ఆంధ్రా అధికారులతో మాట్లాడి 17వ తేదీనే ప్రాజెక్టు గేట్లు తెరిచి ఉంటే ఈ ప్రమాదం జరిగేదికాదని అన్నారు. అధికారుల సమన్వయలోపం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్పష్టంచేశారు. రైతులు తనకు ఫోన్ చేసి చెప్పిన వెంటనే కలెక్టర్, ఎస్పీని తాను అప్రమత్తం చేసినట్టు తెలిపారు. ముందుగా ఎస్పీ నారాయణపురం చేరుకొని వరదలో చిక్కుకున్న వారి ప్రాణాలను కాపాడినట్టు ఆయన పేర్కొన్నారు. 'లైటింగ్ తగ్గి హైలికాప్టర్లు తిరగకపోతే ఎంత ప్రాణనష్టం జరిగి ఉండేది?' అంటూ ఐబీ అధికారులను మందలించారు. హైదరాబాద్ నుంచి హైలికాప్టర్లు నారాయణపురం చేరుకోవడానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉన్నందున ఏపీ ప్రభుత్వంతో మాట్లాడి సత్వరమే రెండు హెలికాప్టర్లను రప్పించినట్టు తెలిపారు. వాటి వల్ల 48 మంది ప్రాణాలను కాపాడగలిగామని అన్నారు. పెదవాగును పరిరక్షించేందుకు ప్రభుత్వపరంగా బాధ్యత తీసుకుంటామని, వచ్చే సీజన్ నాటికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తుమ్మల భరోసా ఇచ్చారు.

అశ్వారావుపేటలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

- గోదావరి ఉధృతిపై నిరంతరం నిఘా పెట్టండి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో విస్తృతంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార-పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల్లో వరద పరిస్థితిని మంత్రి సమీక్షించారు. గోదావరి పరీవాహ ప్రాంతాల ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా రెస్క్యూటీమ్‌లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను వినియోగించాలని అధికారులకు సూచించారు. ప్రమాదకరంగా ప్రవహించే వాగుల నుంచి ప్రజలు దాటకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.